క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

తహసీల్దార్ రమేష్ బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం: భీమిలికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ ఆదివారం ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె.వేణుగోపాల్ పద్మనాభం బదిలీ అయ్యారు. రమేష్ విశాఖ కలెక్టరేట్ డి విభాగం నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పనులు నిబంధనల ప్రకారం జరిగేలా చూస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వ భూములను పరిరక్షించడంతోపాటు ఆక్రమణలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఎవరికైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని వెల్లడించారు.

శ్రీరామ్మూర్తి మృతికి సంతాపం



పద్మనాభం: బీజేపీ మండల శాఖ ఉపాధ్యక్షుడు వాడపల్లి శ్రీరామ్మూర్తి ఆదివారం మృతి చెందారు. శ్రీరామ్మూర్తి కాలేయ సంబంధిత సమస్యతో బాధపడుతూ కొంత కాలం నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం ఆస్పత్రిలో మృతి చెందారు. మృతునికి భార్య తులసి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులకు పలువురు సంతాపం తెలిపారు.

సత్యనారాయణ రాజు మృతికి సంతాపం

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాట్ల సత్యనారాయణ రాజు ఆదివారం మృతి చెందారు. ఈయన 1995 – 2000 మధ్య ఎంపీటీసీ సభ్యునిగా పనిచేశారు. ఈయన తండ్రి జగన్నాథరాజు గతంలో భీమిలి ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రస్తుతం ఈయన సోదరుడు పెదబాబు జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్‌గా ఉన్నారు. ఈయన భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి నివాళులర్పించారు.

ముసిలినాయుడుకు పితృ వియోగం

ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ, దిబ్బడిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కోరాడ ముసిలినాయుడు తండ్రి సూర్యనారాయణ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల ఉపాధ్యక్షుడు పాండ్రంకి శ్రీను, సర్పంచ్ షిణగం అప్పలరాజు, తదితరులు సూర్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అంతా మా ఇష్టం... అడిగేదెవరు?



డ్రైనేజీ నిర్మాణంపై వ్యాపారుల వస్తువులు

- తగరపువలస మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు
- పారిశుధ్య నిర్వహణలో కార్మికులకు కష్టాలు
- మరోవైపు వాహనదారులపై వ్యాపారుల జులం



మెయిన్‌రోడ్డులో డ్రైనేజీని ఆక్రమించి నిర్మించిన దుకాణదారుని మెట్లు



ప్రధాన రహదారి మధ్యలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం

తగరపువలస: స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 60 అడుగుల వెడల్పు కలిగిన రహదారిలో 30 అడుగుల రోడ్డును చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులు ఆక్రమించుకోగా, మరో 5 అడుగుల మేర నిర్మించిన డ్రైనేజీలను కూడా వ్యాపారులు ఆక్రమించుకుని అడ్డాగా మార్చుకున్నారు. దీంతో పారిశుధ్య పనుల నిర్వహణ కష్టంగా ఉంటుందని కార్మికులు వాపోతున్నారు. వ్యాపారుల ఆక్రమణలతో డ్రైనేజీలు మూసుకుపోగా వర్షాకాలంలో డ్రైనేజీల్లో ప్రవహించాల్సిన నీరు రోడ్లపై నిలిచిపోతోంది. ఈ విషయం కళ్లముందు కనిపిస్తున్నా వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు జోగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలపై జీవీఎంసీ అధికారులు స్పందించకపోవడంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మరికొందరు వ్యాపారులైతే తమ షాపుల ముందు డ్రైనేజీలతోపాటు రహదారిని కూడా చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులకు అద్దెకు ఇచ్చి రోజుకు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. వ్యాపారులు సాగిస్తున్న ఈ దందాపై బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తున్నాయి. అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్టు జీవీఎంసీ రహదారులు, డ్రైనేజీలను ఆక్రమించిన వ్యాపారులు వాటిని మరొకరికి అద్దెకు ఇచ్చి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అంటున్నారు.

వాహనదారులపై దాడులు..

తగరపువలస మొత్తం మీద వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోడంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు రోడ్ల పక్కన తమ ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తే దుకాణదారులు రెచ్చిపోతున్నారు. తమ వద్ద పనిచేసే సిబ్బందితో వినియోగదారులపై దాడులు చేస్తూ దూషణలకు దిగుతున్నారు. వ్యాపారులు సొంతంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోగా వినియోగదారులపై తమ జులుం ప్రదర్శిస్తున్నారు. ఆదివారం ఇదే విధంగా రోడ్డు పక్కన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసిన మాజీ సైనికుడిపై రెడీమేడ్ దుస్తుల దుకాణానికి చెందిన ముగ్గురు దూషణల పర్వం మొదలుపెట్టారు. దీనిపై భీమిలి ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులు సొంతంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. పార్కింగ్ సమస్య కారణంగా ద్విచక్రవాహనాలను రోడ్డు పక్కన నిలుపుదల చేసే అవకాశం ఉందని, దీనిపై వ్యాపారులకు ఎలాంటి హక్కులు లేవన్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించడంతోపాటు రహదారిని ఆక్రమించిన వ్యాపారులను తరలించాలని, అప్పటి వరకు తగరపువలసకు ట్రాఫిక్ సమస్య తీరదని పలువురు అంటున్నారు. ఆ దిశగా అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ తరగతులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్‌తో ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తగరపువలస: ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న వంద మంది విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ రూ.20 వేల విలువైన స్టడీ మెటీరియల్ ఆదివారం అందించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సొసైటీ అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని స్కాలర్‌షిప్ సాధించానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.ఆనంద్, చైర్మన్ సుహాసిని, కె.ఎస్.ఎం.సుధాకర్, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, అధ్యక్షుడు దత్తి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు యాగాటి వెంకటరమణ, దత్తి రవికుమార్, పక్కి నాగేశ్వరరావు, బి.హేనా, ఎల్ఎ శ్రీనివాసరావు, వీటీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తగరపువలస: హిందీ భాషా పక్షోత్సవాల్లో భాగంగా భీమిలిలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. హిందీ భాష నేర్చుకోవాల్సిన ఆవశ్యకత, జాతీయ సమైఖ్యత తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి ఈ నెల 29న పక్షోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందించనున్నారు. అనంతరం హిందీ భాష నేర్చుకోవాల్సిన ఆవశ్యకతపై మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

తగరపువలస: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు డిమాండ్ చేశారు. స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27న తగరపువలసలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కానూరి రాంబాబు, తూతిక సోమరాజు, మోర అప్పలరాజు, చిల్ల అప్పలసూరి, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు పాల్గొన్నారు.

సంప్రదాయంగా విగ్రహాల నిమజ్జనం



నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

భీమునిపట్నం: భీమిలి తీరంలో సంప్రదాయబద్ధంగా వినాయక విగ్రహాల నిమజ్జనం సాగుతోంది. శనివారం రాత్రి పలు ప్రాంతాల నుంచి అనేక విగ్రహాలు ఊరేగింపుగా తీరానికి తీసుకొచ్చారు. గతంలో ఇలా వచ్చేటప్పుడు భారీ డీజే సౌండ్ సిస్టమ్‌తో సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ వచ్చేవారు. దీంతో అందరికీ తీవ్ర అసౌకర్యంగా ఉండేది. ఈ ఏడాది మాత్రం గతానికి భిన్నంగా సంప్రదాయ భక్తి పాటలు, సన్నాయిమేళాలు, నేల వేషాలతో నిమజ్జన ఊరేగింపులు కొనసాగాయి.

- చిన్నబజారు సమీపంలోని గణగళ్ల వీధిలో వినాయకుని మండపం వద్ద ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా రాధాష్టమి ఉత్సవాలు



రాధాదేవికి భక్తులు సమర్పించిన పూల మాలలు, పూల బంతులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలోని హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీకృష్ణ మందిరం నిర్మాణ ప్రదేశంలో ఆదివారం రాధాష్టమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ నిష్కించిన భక్త దాస మాట్లాడుతూ రాధాదేవి శ్రీకృష్ణ భగవానుని అంతరంగ శక్తి అని, రాధాదేవి అనుగ్రహం ద్వారానే భక్తులు శ్రీకృష్ణ కృప పొందగలరని చెప్పారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటి నుంచి తెచ్చిన పూలమాలలు, పూల బంతులను రాధాదేవికి సమర్పించారు. అనంతరం రాధాష్టక పఠనం నిర్వహించారు. సంకీర్తనను నిర్వహించగా భక్తులు లయబద్ధంగా స్వరార్చణ చేశారు. కార్యక్రమంలో భక్త అంబరీష దాస, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మధురవాడ పీఏసీఎస్‌ను కాపాడాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నాయకులు

మధురవాడ: ఎంతో విలువైన, లాభాలతో నడుస్తున్న మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్‌ను) కాపాడాలని మధురవాడకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు విశాఖలో ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న జిల్లా సహకార సంస్థ అధికారుల నేతృత్వంలో కొందరు వచ్చి ఇక్కడ ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కూలగొట్టి హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని కొలతలు తీసుకోవడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైందని చెప్పారు. మహాజన సభ ఆమోదం లేకుండా ఇలా చేయడం సహకార సంస్థ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమన్నారు. నియోజకవర్గంలో సుమారు 20 గ్రామాల్లోని రైతులతో 70 ఏళ్ల క్రితం స్థాపించిన సంఘం 400 మందితో ప్రస్తుతం నడుస్తుందని చెప్పారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో నూతన భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని గుర్తు చేశారు. గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న మహాజన సభల్లో ఈ పీఏసీఎస్‌ని క్రెడిట్ సొసైటీగా మార్చాలని ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నా కార్యరూపం దాల్చలేదని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి సహకార సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గుపిల్లి అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పీకేఎమ్ పాత్రుడు, కుడితి రామారావు, సన్యాసిరావు, టీడీపీ నాయకులు పిళ్లా నర్సింగరావు, నాగోతి సూర్యప్రకాశరావు, వాండ్రాసి బాబులు, వాండ్రాసి అప్పలనాయుడు, గొలగాని సన్యాసిరావు సీపీఎం నాయకులు సియ్యాద్రి పైడితల్లి, జనసేన నాయకులు నాగోతి నాయడు తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ గోస్తనీనదిలో ఆదివారం గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని మత్స్యకారులు గుర్తించి భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజులుగా ఈ మృతదేహం పంచాయతీ తీరంలోని నదిలో తుప్పల కింద ఉన్నట్టు గుర్తించామని మరికొందరు మత్స్యకారులు తెలిపారు. మృతుని ముఖ భాగం జలచరాలు తినేయడంతో గుర్తు పట్టలేని విధంగా ఉంది. పోలీసులు మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన



పద్మనాభం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ రవి శంకర్

పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, ఆవరణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి...? కానిస్టేబుళ్లు ఎంత మంది ఉన్నారు..? తదితర వివరాలను సీఐ సన్యాసినాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి నగరానికి వెళ్లిపోయారు.

పారదర్శక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



మధురవాడలో లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: కులం, మతం, ప్రాంతం చూడకుండా, వివక్ష, రికమండేషన్, అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకే అన్ని రకాల సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ జోన్ – 2 మధురవాడ వైఎస్సార్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇటువంటి పారదర్శక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలు, అపార్ట్‌మెంట్ల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. వైఎస్సార్ కాలనీలో కమ్యూనిటీ హాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కొండ వైపు రిటైనింగ్ వాల్, బల్క్ వాటర్, పద్మజ అపార్ట్‌మెంట్ వాసులకు హైవేలో సర్వీసు రోడ్డు ఏర్పాటు, సుముఖ అపార్ట్ వాసులు శైలజ, సతీష్ సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈ ఎస్‌వీఎస్ రామమూర్తి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, పిళ్లా సత్యనారాయణ, పిళ్లా సూరిబాబు, వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకర అప్పారావు, బీఎమ్‌సీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి, సంతోష్, బండారు శివలక్ష్మి, ముచ్చు రామారావు, కావ్య రెడ్డి, చేకూరి రజని, ముచ్చు రామారావు, రుషికేష్, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్.బాబ్జి, అప్పలరాజు, యల్లా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్

మధురవాడ: భవన నిర్మాణ కార్మికులు ఐకమత్యంతో పోరాడితే హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ అన్నారు. కొమ్మాది జంక్షన్ వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే బోర్డును వెనక్కి తీసుకురావడం కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అనంతరం సిటు మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధంగా కృష్ణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ సలహాదారు, అధ్యక్షుడిగా పి.రాజ్‌కుమార్, ఎ.నీలయ్య, అధ్యక్షుడిగా ఎ.లక్ష్మణ, ఉపాధ్యక్షుడిగా కె.రమణ, కార్యదర్శులుగా ఎం.సత్యం, ఎస్.రమణ, కోశాధికారిగా కె.లక్ష్మణ, కార్యవర్గ సభ్యులుగా నరసింగరావు, కె.చిన్నప్పన్న ఎన్నికయ్యారు.

వాడవాడలా అన్నసమారాధనలు



తాటితూరులో గణపతి మండపంలో ముత్తంశెట్టి మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు



ఇసకలపాలెంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



పాత పీఎంపాలెంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొమ్మాది: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వాడవాడలా అన్నసమారాధనలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో 4 వేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, శాకరి శ్రీనివాస్, మాదు రాజు, చంటి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 4వ వార్డు నర్సింహనగర్‌లో మహాలక్ష్మి ప్రసాద్ ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రారంభించారు. ముందుగా ఇక్కడి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. గరికిన నూకరాజు, ఉమ్మిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.
- కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెం వరసిద్ధి వినాయక యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో టీడీపీ 4వ వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు, నారు ఎల్లాజీ, దంతులూరి సిద్ధార్థ వర్మ పాల్గొన్నారు.

తగరపువలస: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల అన్నసమారాధనలు జరిగాయి. జీవీఎంసీ రెండో వార్డు రెడ్డి సంతపేటలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. భీమిలి మండలం తాటితూరులో దొర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ సందర్శించారు. ఆయనకు సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు స్వాగతం పలికారు.



ఎండాడలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

పీఎం పాలెం : వినాయక అనుపు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం పాత పీఎంపాలెంలో భారీ సమారాధన ఏర్పాటు చేశారు. పిలకవానిపాలెం, పరిసర కాలనీల ప్రజలు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

పద్మనాభం: వినాయక ఉత్సవాల్లో భాగంగా కృష్ణాపురం, ఇసకలపాలెం గ్రామాల్లో ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. గంగిరెడ్ల పద్మనాభస్వామి, హంస మహేష్ పాల్గొన్నారు.



నర్సింహనగర్‌లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

గణపతి మండపంలో పూజలు



గణపతి మండపంలో కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్‌నగర్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు శ్రీకాంత శర్మ, కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారావు, పిళ్లా సూరిబాబు, రుషికేష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు అనేష్, మహేష్, శేఖర్, నాని, రమణ, కుమార్, హేమంత్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.